www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 17 అక్టోబర్ 2024
5
అన్నమయ్య

పెద్దదర్గా ఉరుసుకు డిప్యూటీ సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రసిద్ధిగాంచిన కడప పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరుకావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, నిర్వాహకులు ఆహ్వానించారు. బుధవారం విజయవాడలో డిప్యూటీ సిఎంను కలిసి వారు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. నవంబర్ 3 నుంచి పెద్దదర్గా ఉత్సవాలు ప్రారంభవుతాయి. 16వ తేదీన గంధం, 17న ఉరుసు, 18న ముషాయిరా ఉంటాయి.

పవన్ కల్యాణ్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న పీఠాధిపతి ఆరిఫుల్లా

ఏకధార

- నేల కొరిగిన వరి పంట
- ఉల్లి పంటలో వర్షపునీరు నిల్వ
- రైల్వేకోడూరులో ఉప్పొంగిన వాగులు
- అత్యధిక వర్షపాతం 134 మి.మీ
- నేడు, రేపూ ద్రోణి ప్రభావం?!

ఉభయ జిల్లాల్లో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. ఆకాశానికి ధారం కట్టిన చందాన్ని తలపిస్తోంది. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం కారణంగా సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉపరితలద్రోణి ప్రభావం కొనసాగే అవకాశాలు ఉన్నాయనే వాతావరణశాఖ హెచ్చరిక ఆందోళన కలిగిస్తోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి బుధవారం వరకు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో 134 మి.మీ, కడప జిల్లా పోరుమామిళ్లలో 90 మి.మీపైగా వర్ష పాతం నమోదైంది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాల్లోని లోతట్టు ప్రాంతా ల్లోకి నీరు చేరడంతో పాటు పలుప్రాంతాల్లో వరి, ఉల్లి పంట నేలకొరగడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్ సాగుకు ఆశావహమైన రీతిలో వర్షపాతం నమోదు కావడం ఉపశమనాన్ని కలిగిస్తోంది.

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/రాయచోటి

జిల్లాల్లో అల్పపీడన ద్రోణి ప్రభావం కొనసాగుతోంది. అన్నమయ్య జిల్లాలో మోస్తరు వర్షపాతం నమోదైంది. రాజంపేట డివిజన్ పరిధిలోని రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లి, రాజంపేట మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. రైల్వేకోడూరులో అత్యధికంగా 134 మి.మీ వర్షపాతం నమోదైంది. ఫలితంగా వాగులు, వంకలు ఉప్పొంగాయి. రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో వరి, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఇటు వంటి పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయాధికారులు నేలకొరిగిన వరి పంట లను పరిశీలించడంపై దృష్టి సారించారు. శెట్టిగుంట పరిధిలోని జానకీపురం, శ్రీనివాసపురం గ్రామాల్లోకి వరదనీరు చేరింది. కలెక్టర్ అప్రమత్తమై డివిజన్ కేంద్రాల్లో పర్య వేక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి పునరావాస సహాయక చర్యలు చేపట్ట డంతో ఉపశమనాన్ని కలిగిస్తోంది. కడప జిల్లాలోని బద్వేల్ డివిజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదైంది. పోరుమామిళ్ల, సిద్ధ వటం, ఒంటిమిట్ట మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమ నార్హం. దీంతోపాటు పులివెందుల, ప్రొద్దుటూరు డివిజన్ల పరిధిలో సాగు చేసిన వరి, ఉల్లి పంటల్లోకి వర్షపునీరు చేరడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన బుడ్డ శనగ, వేరుశనగ, మినుములు, పత్తి, సోయాబీన్ పంటలకు ఉపశమనం కలిగిస్తుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కడప, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పులివెందుల నియోజకవర్గాల్లో పండ్ల తోటలతో సహా వేరుశనగ తదితర పంటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ నిరాశ కలిగించిన నేపథ్యంలో తాజాగా ఏర్పడిన అల్పపీడనద్రోణి రబీ సీజన్ కలిసి వచ్చే అవకాశంపై రైతులు ఆశలు పెంచుకున్న నేపథ్యం కనిపిస్తోంది.

పదును దాటని వర్షం : జిల్లాలో పదును వర్షపాతం నమోదు కావడం గగనంగా మారింది. కడప జిల్లాలో పోరుమామిళ్ల, అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబుల వారిపల్లి, రాజంపేట, నందలూరు మండలాల్లో ఆశాజనక వర్ష పాతం నమోదు కావడం మినహా మిగిలిన మండలాల్లో మోస్తరు వర్షపాతానికి పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. మరో రెండు రోజులు ఉపరితలద్రోణి ప్రభావం కొనసాగనున్న నేపథ్యంలో ఏమేరకు లాభాన్ని, నష్టాల్ని కలిగిస్తుం దో వేచి చూడాలి. సోమవారం ఉదయం నుంచి కడప, బద్వేల్, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గ ప్రాంతాల్లో మోస్తరు జల్లుతో సరిపెట్టింది. ఫలితంగా కడప జిల్లా వ్యాప్తంగా 3.76 లక్షల ఎకరాల్లో 2.80 లక్షల ఎకరాల వరకు బీళ్లుగానే మిగిలిపోయాయి.

రైల్వేకోడూరు : జలమయమైన ప్రధాన రహదారి

బుడ్డశనగ సాగు ప్రశ్నార్థకం! : జిల్లాలోని 26 నుంచి 33 మండలాల్లో బుడ్డశనగ సాగవుతోంది. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో బుడ్డశనగ, వేరుశనగ, పత్తి, మినుములు, సోయాబీన్ ప్రధాన పంటల సాగుకు అవసరమైన వర్షపాతం నమోదు అవుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. 2024-25 రబీ సీజన్ సాగులో నూనె గింజల ఆధారిత అత్యధిక వాటా వీటిదే. ఇందులో గతేడాది తర హాలోనే బుడ్డ శనగ సుమారు 2,32,360 లక్షల ఎకరాలు, 22,915 వేల ఎకరాల్లో మినుము పంట గణనీయంగా సాగవుతోంది. వేరుశనగ, పత్తి, సోయాబీన్ పంటలు గణనీయమైన సంఖ్యలో సాగుతుండడం తెలిసిందే. ప్రతి ఏటా అక్టోబర్ ఒకటి నుంచి ఆశాజనకంగా వర్షపాతం నమోదు కావడం తెలిసిందే.

రైల్వేకోడూరులో 134.4 మి.మీల వర్షపాతం : రైల్వేకోడూరులో అత్యధికంగా 134.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుండి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడులో 29.4, చిన్నమండెంలో 17.4, సంబేపల్లిలో 25.0, సుండుపల్లిలో 37.6, రాయచోటిలో 52.6, లక్కిరెడ్డిపల్లిలో 23.6, రామాపురంలో 30.2, వీరబల్లిలో 47.4, నందలూరులో 54.4, పెనగలూరులో 33.4, చిట్వేల్‌లో 66.2, రాజంపేటలో 48.8, పుల్లంపేటలో 90.4, ఓబులవారిపల్లెలో 81.8, ములకలచెరువులో 14.4, తంబళ్లపల్లెలో 20.2, పెద్దమండ్యంలో 25.6, గుర్రంకొండలో 15.8, కలకడలో 15.4, కెవి.పల్లెలో 21.8, పీలేరులో 18.6, కలికిరిలో 13.6, వాల్మీకిపురంలో 8.6, కురబలకోటలో 19.0, పెద్దతిప్పసముద్రంలో 16.6, బి.కొత్తకోటలో 11.6, మదనపల్లెలో 12.4, నిమ్మనపల్లిలో 12.0, రామసముద్రంలో 16.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

రైల్వేకోడూరు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి, ఎమ్మెల్యే శ్రీధర్

డ్రోన్ టెక్నాలజీతో వర్ష ప్రభావం అంచనా : అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావాన్ని అంచనా వేసేందుకు అధికారులు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం జిల్లాలోని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులను కూడా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. వాగులు, వంకలు, నదులు, లోతట్టు ప్రాంతాలలో పరిస్థితులను ఎప్పటికప్పుడు డ్రోన్తో పరిరక్షిస్తూ జిల్లా కేంద్రానికి సమాచారం ఇస్తున్నారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు : కలెక్టరేట్ కార్యాలయంతో పాటు రాజంపేట, మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశారు.జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, రాయచోటి కంట్రోల్ రూమ్ : 08561-293006,ఆర్డీవో కార్యాలయం, రాయచోటి : 08561-293039, సబ్ కలెక్టర్ కార్యాలయం, రాజంపేట: 08565-240079, సబ్ కలెక్టర్ కార్యాలయం, మదనపల్లి : 99891-76247, ప్రతి తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

రోడ్డుపై భారీ కేడ్లు ఏర్పాటు

పుల్లంపేట : భారీ వర్షాల కారణంగా లోతట్టు గ్రామాలను రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి పరిశీలించారు. సాతువారిపల్లె గ్రామం దగ్గర ఉన్న రోడ్డుపై నీరు చేరడంతో పరిశీలించి తక్షణమే భారీకేడ్ ఏర్పాటు చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. తుఫాను ప్రభావం వలన మండల ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు వాటిల్లకుండా రెవెన్యూ వ్యవస్థను తహశీల్దార్ పటిష్టం చేశారు. ఇప్పటివరకు తుఫాన్ ప్రభావం వలన మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో పిఆర్ ఇఇ, తహశీల్దార్ అరవింద్ కిషోర్, ఆర్ఐ సుశీల్ కుమార్, ఎంపిడిఒ జయశ్రీ, ఇఒపిఆర్‌డి పెంచలయ్య, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : బహుదా ప్రాజెక్టును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నేల కొరిగిన వరి పంట

రాజంపేట అర్బన్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజుల నుంచి నిరవధికంగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని అనేక ప్రాంతాలలో వరి పైరు నీట మునిగి రైతు కంట కన్నీరు మిగిల్చింది. మండల పరిధిలోని గుండ్లూరు, పాటూరు తదితర గ్రామాలలో వరి పైరు నీట మునిగి తేలియాడుతోంది. సుమారు వంద ఎకరాలకు పైగా వరి నీట మునిగి నీటిలోనే మొలకలు రావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి జరిగిన పంట నష్టాన్ని పరిశీలించి నివేదికలు ప్రభుత్వానికి పంపి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.**వాల్మీకిపురం:** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన వరిపంట నీట మునిగి పక్కకు వాలిపోయింది. దీంతో రైతులు వరిపంటను నిలబెట్టుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండల వ్యాప్తంగా ఉన్న టమేట, మునగ, వంకాయ, వేరుశెనగ పంటలు కొద్దిపాటిగా దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా 52.4 ఎంఎంఎస్ వర్షపాతం నమోదు అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. **వరి పంటలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి :** వర్షాలకు వరి పంటలో నీరు నిల్వ ఉండి మునిగిపోయే అవకాశం ఉంది. కావున రైతులు వరి పంటలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. అలాగే పక్కకు వాలిన వరి పంటను నిలబెట్టుకోవడం వలన వరి దెబ్బతినకుండా ఉంటుంది. మండల వ్యాప్తంగా ఉన్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఫీల్డుపై ఉన్నారు. ప్రతి గ్రామంలో పంటలను పరిశీలిస్తూ దెబ్బతిన్న పంటలను నమోదు చేస్తున్నారు. **పంటలను పరిశీలించిన ఎఒ :** వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారిని రాజకుమారి బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని పోలి అప్పరాజుపేటలోని చవనబాబు, చవన శ్రీనివాసులు వరి పొలాలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. పొలంలో ఉన్న వర్షపు నీటిని వెంటనే తొలగించాలని, వర్షం ఆగిపోయే వరకు ఎవరూ పంట కోతలు చేపట్టవద్దని సూచించారు. నీటిలో మునిగిన వరి గింజలు మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచకారి చేయడం ద్వారా మొలకలు రాకుండా జాగ్రత్తలు పడాలని సూచించారు.

రాజంపేట : గుండ్లూరులో నీట మునిగిన వరి పంట

లోతట్టు ప్రాంతాలలో పర్యటించిన సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

రైల్వేకోడూరు: పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్,టిడిపి యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి పర్యటించారు. తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. నరసరాంపేట, అంకమ్మ నగర్, ఉంగరాల నగర్,ఆంజనేయస్వామిగుడి వీధి తదితర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తుఫాన్ కారణంగా ప్రాణ నష్టం,ఆస్తి నష్టం జరగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. **భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం :** పట్టణంలో బుధవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమ యమయ్యాయి. ప్రధాన రహదారిలో భారీగా వరద నీరు ప్రవహిస్తూ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని అంకమ్మ నగర్ లోతట్టు ప్రాంతంలో వర్షపు నీళ్ళు పోయేందుకు వీలులేక వీధులన్నీ జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి నీరు ప్రవేశిస్తుంది. పంచాయతీ ఇఒ ప్రసాద్‌రావు లోతట్టు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేశారు. గుంజననదీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

చెరువులను పరిశీలించిన అధికారులు

బి.కొత్తకోట : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ, ఎంపిడిఒ శంకరయ్య, రెవెన్యూ ఆర్ఐ వీరాంజ నేయులు, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు బీరంగి చెరువు, కంబల్లపల్లియేరు, నాగలచెరువును పరిశీలించారు. భారీ వర్షాలకు చెరువు కట్టలు తెగిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. భారీ వర్షాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు సహాయ, సహకారాలు అందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

వాల్మీకిపురం: నేలకొరిగిన వరి పంటను చూపుతున్న రైతు

చెరువు కట్టలు తెగిపోకుండా చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తు న్నాయని చెరువు కట్టలు తెగిపోకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో చెరువుల స్థితిగతులను పరిశీలించారు. చీకిల బైలు పంచాయతీలోనవెంకటమ్మ చెరువు, కదిరమ్మ చెరువు, మేడిపల్లి చెరువు కట్టలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా నియోజకవర్గంలో వర్షాలు కురుస్తున్నాయని, ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. భారీ వర్షాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు సహాయ, సహకారాలు అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, మాజీ జెడ్పిటిసి రంగప్ప, తహసిల్దార్ ఖాజాబీ, ఆర్.ఐ రెడ్డప్ప, ఇరిగేషన్ ఏఈ రాయల్ బాబు, రాజేంద్రప్రసాద్,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఫోటో

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సబ్ కలెక్టర్

నిమ్మనపల్లె: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్ అన్నారు. బుధవారం నిమ్మనపల్లె మండలంలోని బహుదా ప్రాజెక్టును పరిశీలించారు. ఇరిగేషన్ ఇఇని, అధికారులను ప్రాజెక్టు నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బహుదా నుంచి నీరు ఆయకట్టు రైతులకు ఏ మేరకు అందుతుందో విచారించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీరం దాటే సమయంలో వర్షాలు అధికంగా కురుస్తాయని ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని చెరువు కట్టలను పరిశీలించి, ముందస్తుగా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. బహుదా ప్రాజెక్టు వద్ద ఇరిగేషన్ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందని, ప్రజలు అధికారులకు అత్యవసర సమాచారాన్ని అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, తహశీల్దార్ ధనంజయులు, ఇరిగేషన్ ఇఇ, ఎఇ శ్రీహరి రెడ్డి, రెవెన్యూ అధికారి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె : చెరువు కట్టలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

'మిట్స్' ప్రిన్సిపల్ యువరాజ్‌కు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్‌కు రాష్ట్ర స్థాయి ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఇ-2024) బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డును ప్రకటించారని ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఐఎస్‌టిఇ మేనేజ్‌మెంట్ కమిటీ వారు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్-2023గా జి.కృష్ణకుమార్ స్మారక రాష్ట్ర అవార్డుకు తనకు ప్రకటించిందన్నారు. ఈ అవార్డును 25 అక్టోబర్ 2024న కర్నూల్‌లోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో జరుగు అవార్డుల ప్రదానోత్సవంలో ఈ అవార్డును అందుకుంటానన్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఇ) ప్రతి ఏటా ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డులు ప్రకటిస్తారని, ఈ సంవత్సరానికి గాను బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డు డాక్టర్ సి.యువరాజ్‌కు దక్కిందని ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, అధ్యాపకులు, విద్యార్థులు డాక్టర్ సి.యువరాజ్‌కు అభినందనలు తెలియజేసారు.

రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి :'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి అని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించడం ద్వారా సీతా రాముల సద్గుణాలును, గొప్పదనాన్ని చెప్పడంతో పాటు ఆదర్శవంతమైన జీవితం, కుటుంభ విలువల నుంచి పాలనా సూత్రాల వరకు, సమాజ శ్రేయస్సుకు అవసరమైన ఎన్నో జీవన సూత్రాలను తెలియచేసిన వాల్మీకి మహర్షికి మనమందరం రుణపడి ఉన్నామన్నారు. రామాయణం సామాజిక నీతిని బోధిస్తుందని, భారత లౌక్యం నేర్పిస్తుందన్నారు. వాల్మీకి మహర్షి 24 వేల శ్లోకాలుతో, ఏడు కాండములుతో మానవాళికి అద్భుతమైన రామాయణం కావ్యాన్ని అందిచారన్నారు. వాల్మీకులకు గత జగన్ ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేసిందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా అయన వాల్మీకి మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన రేపూరి వేణుగోపాల్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రోడ్డు-భవనాలు, మౌలిక సదుపాయాలు , పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డిని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ రేపూరి వేణుగోపాల్ బుధవారం విజయవాడ సచివాలయంలో మంత్రి చాంబర్లో కలిశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను మంత్రికి వివరించినట్లు తెలిపారు.

కల్లూరు అడవికి చేరిన ఏనుగుల గుంపు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పరిసర ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఏనుగుల గుంపు ఎట్టకేలకు కల్లూరు రక్షిత అటవీ ప్రాంతానికి చేరింది. పీలేరు మండలం, కాకులారంపల్లి పంచాయతీ, ఇందిరమ్మ కాలనీ సమీపంలోని యల్లెల రెడ్డప్పరెడ్డి మామిడి తోటలోకి సోమవారం రాత్రి ఏనుగుల గుంపు చేరుకుందన్న విషయం తెలియని బందార్లపల్లి గ్రామానికి చెందిన రైతు, మాజీ ఉపసర్పంచ్ మోపిరెడ్డి చిన్న రాజారెడ్డి మంగళవారం ఉదయం మేత కోసం తన ఆవులను తోలుకుని పొలం వద్దకు బయలుదేరాడు. మామిడి తోటలోని ఏనుగుల గుంపు ఆవులు తోలుకుని తమ వైపు వచ్చిన రైతుపై కోపంగా విరుచుకుపడ్డాయి. రైతును ఓ ఏనుగు తన తొండంతో పట్టి దూరంగా విసిరి పడేసి హతమార్చాయి. పగలంతా ఆ మామిడి తోటలోనే సంచరించిన ఏనుగుల గుంపును మంగళవారం రాత్రి అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి, అవి జనావాసాల వైపుకు రాకుండా, దూరంగా అటవీ మార్గం పట్టించేందుకు వారు చేసిన ప్రయత్నం ఫలించింది. ఏనుగుల గుంపును క్రాకర్స్ సాయంతో పీలేరు మండలం, సదుం మార్గంలోని నూనెవాండ్లపల్లి, ఎనుమలవారిపల్లి ప్రాంతాల మీదుగా కల్లూరు రక్షిత అటవీ ప్రాంతానికి పంపగలిగారు. పగలు విశ్రాంతి తీసుకుని, రాత్రిళ్ళలో మాత్రమే నడక సాగించే ఏనుగుల గుంపును సదుం, సోమల, చౌడేపల్లి అటవీ మార్గంలోని ట్రాక్ ద్వారా పలమనేరు కౌండిన్య అటవీ ప్రాంతానికి చేరుకునే వరకు తాము అనుసరిస్తుంటామని అటవీశాఖ అధికారులు అంటున్నారు. ఆయా మార్గంలోని గ్రామాల ప్రజలకు కూడా సమాచారం అందిస్తూ వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్లు తెలియజేశారు. అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖల యంత్రాంగం సంయుక్తంగా జోరు వానలోనూ ఏనుగుల కదలికలను పర్యవేక్షిస్తూ, వాటి నుంచి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టానికి ఏమాత్రం అవకాశం లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. పీలేరు మండల శివారులో ఏనుగుల దాడిలో జరిగిన ఆస్తి నష్టాన్ని కూడా అటవీ శాఖ యంత్రాంగం అంచనా వేస్తోంది.

పీలేరు పరిసరాల్లో పంటలను చూస్తున్న అధికారులు

అభివృద్ధి చూసి ఓర్వలేకనే విమర్శలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని టిడిపి రూరల్ మండలాధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు మద్యం పై పెట్టిన దృష్టి సూపర్ సిక్స్ పథకాలపై పెట్టలేదని వైసిపి నాయకులు నోరు పారేసుకోవడం సరికాదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో నవరత్నాల్లో భాగంగా సంపూర్ణ మద్యపాన నిషేధం చేసి ఓట్లు అడుగుతామన్న వారు మద్యం ధరలు పెంచి, నాణ్యతలేని మద్యం ఏరులై పారేలా ప్రభుత్వమే ముందు అమ్ముకొని ఖజానా నింపుకున్నారని అన్నారు. వైసిపి పాలనలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, అమరనాథరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి చేసిన కబ్జాలన్నీ కళ్ళకు గంతలు కట్టినట్లు కనిపిస్తున్నాయని అన్నారు. వంద రోజుల కూటమి పాలనలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్న క్యాంటిన్‌లు , ఉచిత ఇసుక నెరవేర్చిందని దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. కరీం, సర్పంచ్ కామినేని హరి, మాలగాసి మహేష్, కామినేని సతీష్, కెసి.సుబ్రహ్మణ్యం, మలిశెట్టి సుబ్బరాయుడు, కత్తి నరేష్, చుండు బాలజి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అష్రఫ్, జమియత్ ఉలమ-ఎ-హింద్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు ఇందాదుల్లా ఖాస్మి పేర్కొన్నారు. బుధవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారీ వర్షాల విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, దురదృష్టవశాత్తు విపత్తు సంభవిస్తే జిల్లా యంత్రాంగానికి మా సంస్థ ద్వారా ఎటువంటి ఆహాయ సహకారాలు ఐనా అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు, జమియత్ ఉలమ -ఎ-హింద్ కమిటీ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అందరూ చెరువు కట్టలు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టి పెట్టి వర్ష ప్రభావిత ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉండేందుకు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు, ఆజాద్ వెల్ఫర్ సొసైటీ అధ్యక్షుడు షాహూల్ హమీద్, ఎంహెచ్‌పిఎస్ బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు మస్తాన్, లోకం బీడీ అష్రఫ్, పట్టణ అధ్యక్షుడు అమీర్జాన్ పాల్గొన్నారు.

ఎన్‌డిడిసి నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గత ప్రభుత్వ హయాంలో నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ కింద పాల డెయిరీల అభివృద్ధి కోసం తీసుకొన్న నిధులు దుర్వినియోగం చేశారని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ ఆరోపించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాల డెయిరీ ఆధునీకీకరణ కోసం గత ప్రభుత్వం తీసుకున్న రూ.2 వేల కోట్ల రుణం దుర్వినియోగం చేసిందని అన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. డెయిరీ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో పాటు అమూల్ డెయిరీ అప్పగించి పాడి రైతులకు అన్యాయం చేశారన్నారు. కేవలం హెరిటేజ్‌ను నాశనం చేయాలనే ఉద్దేశపూర్వకంగానే డెయిరీ వ్యవస్థను గత ప్రభుత్వం నాశనం చేయగా నేడు అమూల్ డెయిరీ కూడా ఎత్తిపోయే పరిస్థితికి చేరుకుందని అన్నారు. నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ కింద మంజూరు చేసిన నిధులపై సమగ్ర విచారణ జరిపించి పాల డెయిరీ వ్యవస్థను ఆధునికరించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవ వేడుక

ప్రజాశక్తి-పీలేరు

ప్రపంచ ఆహార దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. గురువారం కలికిరి జెఎన్‌టియులో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులు డిగ్రీ పట్టాతో పాటు వివిధ నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చి ప్రోత్సహించారు. వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.త్యాగరాజన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహార అలవాట్లు, ఆహార వృథా గురించి వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్.విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ ఆహార దినోత్సవ నేపథ్యం, ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఇతర విభాగాధిపతులు కూడా ప్రపంచ ఆహార దినోత్సవం గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ద్వితీయ ఫుడ్ టెక్నోవ్ మ్యాగ్జిన్‌ను విడుదల చేశారు. ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో వివిధ ఈవెంట్లు నిర్వహించారు. పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, ఫోటోగ్రఫీ, రీల్స్ కాంటెస్ట్ నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్య ఇతర విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

ద్వితీయ ఫుడ్‌టెక్నోవ్ మ్యాగ్జిన్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

వాయిదా తీర్మానం ప్రకటిస్తున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో బుధవారం జరగవలసిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. ఎంపిపి శ్రీదేవిరవికుమార్ ఆధ్వర్యంలో జరగ వలసిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి కావలసిన కోరం సభ్యులు హాజరు కాకపో వడంతో ఎంపిపి ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు తెలిపారు. తుఫాను కారణంగా ఒక ఎంపిటిసి సభ్యురాలు హాజరు కాగా మిగిలిన సభ్యులు గానీ, సర్పంచ్‌లుగానీ హాజరు కాకపోవడంతో వాయిదా పడినట్లు తెలిపారు. తిరిగి మండల సర్వసభ్య సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని పేర్కొన్నారు.

కూలీలకు ఆహార భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వ్యవసాయ కూలీలకు ఆహార, జీవనోపాధికి భద్రతను కల్పించాలని వారి ఆకలి తీర్చాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కె.శోభ తహశీల్దార్ ధనుంజయులకు వినతి పత్రాన్ని అందించారు. మంగళవారం ప్రపంచంతా ఆహార దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నారని, కానీ అందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆహార దినోత్సవాన్ని ఆకలి దినంగా పరిగణిస్తోందని పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య ప్రజలు కొని తినలేని పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. కూలీలకు పని లేక, పనికి తగిన వేతనం అందక, కుటుంబాలను పోషించుకోలేక కూలీలు భూమిలేని కూలీలుగానే మిగిలిపోతున్నారని తెలిపారు. కూలీలకు తగినంత పని కల్పించి, వేతనాలు సక్రమంగా అందేలా, పౌష్టికాహారం కూలీలకు అందు బాటులో ఉండేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు రోజుకి రూ.850 కూలిగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళా కూలీలకు ప్రసూతి ప్రయోజనం కింద ఆరు నెలల పాటు పదివేల రూపాయల చొప్పున అందించా లన్నారు. ప్రతికూలీకి ఇంటిని మంజూరు చేయాలన్నారు. మండలంలోని 22 ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాలలో శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వర్షంలో పంట కోతలు చేపట్టొద్దు

ప్రజాశక్తి-రామాపురం

ప్రస్తుతం వరి, వేరుశనగ పంటల కోత సమయమని, వర్షాలు కురుస్తున్న సమయంలో పంట కోతలు చేపట్టవద్దని మండల వ్యవసాయ అధికారి వైజాగాంగాని రైతులకు సూచించారు. మండలంలోని గోపగుడిపల్లె కల్లాల చెరువు గ్రామాలలో బుధవారం పొలం పిలుపోగ్రామ్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, వేరుశనగ పంట కోతదశలో ఉన్నాయని వర్షాలు పడేటప్పుడు పంట కోతలు చేపట్టవద్దని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వరి పొలాల్లో నీరు నిలువ లేకుండా కాలువలతో నీటిని బయటికి పంపాలన్నారు. వరి గింజ రంగు మారకుండా ఉండేందుకు కార్బెండిజం ఒక గ్రామం మ్యాంకోజాబ్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. వర్షానికి వరి కంకులు మొలకలు రాకుండా ఉండడానికి ఉప్పు ద్రావణం కంకుల పై పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

విద్యార్థుల సౌలభ్యం కోసమే డైనింగ్ హాల్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థుల సౌలభ్యం కోసమే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టామని, హాల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారులను ఆదేశించారు. జడ్‌పి హైస్కూల్ నిర్మాణంలో ఉన్న డైనింగ్ హాలు నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో ఇబ్బందులు లేకుండా డైనింగ్ హాల్ నిర్మిస్తు న్నామని తెలిపారు. కాంట్రాక్టర్ మల్లికార్జున డైనింగ్ హాల్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారని కితాబిచ్చారు. నిర్దేశించిన గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయగలరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంఇఒప్రభాకర్ రెడ్డి, జడ్‌పిహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు నాగళ్ల శివన్న, సంగం శ్రీనివాసులు, నాగార్జున బాబు, షంషీర్, కంచర్ల మల్లికార్జున నాయుడు, జీవి నాయుడు, బాలమాలి శేఖర్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

పశువులకు నట్టల నివారణ టీకా వేయాలని పశు వైద్య అధికారి నాగరాజు సచివాలయ వెటర్నరీ వైద్యులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులను వర్షానికి తడవకుండా షెడ్లు ను నిర్మించుకోవాలని చెప్పారు. దూడలకు పశువులకు వ్యాక్సిన్ వేయించుకోవాలని పశు పోషకులకు ఒక ప్రకటనలో సూచించారు. గొర్రెలు మేకలలో ఉండే అంతర పరాన్న జీవులను నివారించేందుకు ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఉచిత నట్టల నివారణ మందులు ఈ నెల చివరి వరకు జరుగుతుందన్నారు. గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించి నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

చినుకు పడితే చిత్తడే..

- బురదమయంగా మారిన వారపు సంత

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ వారపు సంత బురద మయంగా మారి వ్యాపారస్తులకు ఇబ్బందికరంగా ఉన్నట్లు స్థానికులు వాపోతున్నారు.కొద్దిపాటి వర్షానికే చిత్తడి చిత్తడిగా మారి బురదమయంగా తయారయ్యి దుకాణముల వద్ద కొనుగోలుదారులకు ఇబ్బందిగా ఉన్నట్లు తెలిపారు. వారపు సంతకు ఆదాయం ఉన్నప్పటికీ పంచాయతీ వారు పట్టించుకోకపోవడం వల్ల కొద్ది పాటి వర్షానికే బురద మయంగా మారి ఇబ్బందిగా మారుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలం పాటల ద్వారా వారపు సంతకు లక్షలకు లక్షలు ఆదాయం ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చర్య తీసుకుని వారపు సంతను సరిదిద్ద వలసిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, L.R.PALLI

I.A.No. 179/2024

O.S.No. 34/2024

1. ముసల్‌రెడ్డిగారి రాజారెడ్డి, S/o నడిపి రెడ్డెన్న, హిందూ, వయస్సు 65 సం॥లు, వ్యవసాయం వలన జీవనం.
2. ముసల్‌రెడ్డిగారి వేదమూర్తిరెడ్డి, S/o రామచంద్రారెడ్డి, వయస్సు 45సం॥లు, వ్యవసాయం వలన జీవనం,

ఇద్దరిది అప్పకొండయ్య గారిపల్లి, లక్కిరెడ్డిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా.

...పిటిషనర్లు/వాదులు

Vs

D3. ముసల్‌రెడ్డి గారి పవన్‌కుమార్ రెడ్డి, S/o చెన్నారెడ్డి, వయస్సు 40 సం॥లు, వ్యవసాయం వలన జీవనం, అప్పకొండయ్యగారిపల్లి, లక్కిరెడ్డిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా. **...రెస్పాండెంట్/3వ ప్రతివాది**

నోటీసు

పై నెంబరు యొక్క దావా 3వ ప్రతివాది మరియు (3వ రెస్పాండెంటు) అయిన మీ మీద సదరు వాదులు దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావా ఈ దినం అనగా 29. 10.2024వ తేదీన వాయిదాగా వుంటుఉన్నది. అందువలన మీరు 3వ ప్రతివాది (3వ రెస్పాండెంటు) అయిన మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని సదరు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనంతట మీ పరోక్షముగా తీర్మానించబడును.

వి.సి.రెడ్డెప్పరెడ్డి

వాది(పిటిషనరు) పరం న్యాయవాది, రాయచోటి.

పల్లెపండుగతో గ్రామాలకు నూతన శోభ

పుల్లంపేట : సిసిరోడ్డుకు భూమిపూజ చేస్తున్న రూపానందరెడ్డి,శ్రీధర్

ప్రజాశక్తి-పుల్లంపేట

పల్లెపండుగతో గ్రామాల్లో నూతన శోభ సంతరించుకుంటాయని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. ఓబులవారిపల్లి మండల పరిధిలోని పాపి రెడ్డి పల్లి గ్రామంలో రూ.9లక్షల వ్యయంతో 200 మీటర్లు, పుల్లంపేట మండలం లోని అప్పయ్యరాజుపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామక్కపల్లె గ్రామంలో రూ.26లతో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ప్రతి మారుమూల గ్రామానికి నూతన వైభవం తీసుకొస్తు న్నామని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ కాలు వలు, పల్లెలకు కావలసిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్ర మంలో ఎంపిడిఒ జయశ్రీ,జనసేన నాయ కుడు పసుపులేటి వెంకటరమణ, టిడిపి మండల అధ్యక్షుడు ఆర్.సుధాకర్ నాయుడు, ఉపాధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, ఎపిఒ శ్రీనివాసులు, అధికా రులు ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు. **కలికిరి** :గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలని ఎంపిడిఒ భానుమూర్తిరావు అన్నారు. పల్లె పండగ కార్యక్ర మాన్ని ఎంపిడిఒ భానుమతిరావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపో నెంట్ కింద మంజూరైన పల్లె అభివృద్ధి పనులకు స్థానిక సర్పంచ్‌ల ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. మండలంలోని మెడికుర్తి దచీశీఅవగమదనమోహన్, రాజంపేట డాక్టర్ సెల్ కార్యదర్శి డాక్టర్ షఫినాయక్ జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్ బాబు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి** : నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ కాలవలు ఏర్పాటు చేసి గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దిన్నపాడు, చింతకుంటపల్లి, అనంతపురం ఈడిగపల్లి లో సిసి రోడ్ల నిర్మాణానికి లక్ష్మి ప్రసాద్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ పల్లెల్లో అభివృద్ధిని కాంక్షిస్తూ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఏడు రోజులపాటు పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పల్లెపండుగ వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండల నాయకుడు యనమల మదనమోహన్, రాజంపేట డాక్టర్ సెల్ కార్యదర్శి డాక్టర్ షఫినాయక్ జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్ బాబు ,వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

చింతకుంట పల్లెలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న లక్ష్మి ప్రసాద్ రెడ్డి

వర్షాకాలంలో పశువులను సంరక్షించుకోవాలి

రాజంపేట : పాడి రైతులకు సూచనలు ఇస్తున్న పశు వైద్యులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రస్తుత తుఫాను నేపథ్యంలో పశు యజమానులు అప్రమత్తంగా ఉండి తమ పశువులను సంరక్షించుకోవాలని పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పులపుత్తూరు, హెచ్.చెర్లోపల్లి, మందపల్లి, పి.కారంపల్లి, ఊటుకూరు తదితర గ్రామాలను సందర్శించారు.ఈ సందర్భంగా పశు యజమా నులతో ఆయన మాట్లాడుతూ పశువుల మేత తడిచిపోకుండా భద్రప రుచుకోవాలన్నారు. దాణా తడిస్తే బూజు పట్టి మేతకు పనికిరాకుండా పోతుం దని తెలిపారు. వర్షంలో మేతకు తోలవద్దని, కూలిపోయే అవకాశం ఉన్న గోడల వద్ద, పాకలు, చెట్ల కింద పశువులను కట్టివేయొద్దన్నారు. పశు వులు వర్షంలో తడిస్తే శరీర ఉష్ణోగ్రతలు తగ్గిపోయి జబ్బు చేసి చనిపోయే ప్రమాద ముందని, ముఖ్యంగా దూడలు, గొర్రెలను తడవకుండా చూసుకోవాలని సూచించారు. పశువులు ఏవైనా మరణిస్తే పశు వైద్య సిబ్బం దికి తెలియజేస్తే పై అధికారులకు వివరాలు పంపించడం జరుగుతుందన్నారు. గేదెలు, ఆవులకు పచ్చిక బొమ్మ, జబ్బరాపు రాకుండా, గొర్రెలకు నేల మరక రాకుండా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పశు యజమానులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ చెర్లోపల్లి పశువైద్యాధికారి ఎన్.శరత్‌కుమార్‌రెడ్డి, అత్తిరాల పశువైద్యాధికారి కె.భాగ్యవతి, జేవివో ఎం.వరదయ్య, ఎల్ ఎస్ ఏ మహేష్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. **వీరబల్లి** : మండలంలో తుఫాన్ సమయంలో పశువులకు జాగ్రత్తలు తీసుకోవాలని పశుడాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వులను ఎత్తైన సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పశువులను బలహీ నమైన పాకలు, చెట్ల కింద కట్టి వేయరాదని, ఎలక్ట్రిక్ స్తంభాలకు, వేలాడే తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర పశువులను ఉంచుకూడదని సూచించారు. పశు వులకు సరిపడేంత గడ్డి, దానా అందుబాటులో ఉంచుకోవాలి, గొర్రెలు మేక లను నది పరివాహక ప్రాంతాల్లో కాకుండా సురక్షిత ప్రదేశాలలో మేపు కోవా లని, పశు వైద్యుల సలహాలు పాటించాలని చెప్పారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే సురక్షిత కాన్పులు

ప్రజాశక్తి కలకడ

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షిత కన్పులు జరుగుతాయని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎంవి.కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దేవులపల్లికి చెందిన బొజ్జశంకరయ్య భార్య మరియమ్మకు మూడవ కాన్పు పిహెచ్‌సిలోనే వైద్య సిబ్బంది సురక్షితంగా చేశారు. . స్టాఫ్ నర్స్ జయ భారతమ్మ ,లక్ష్మీదేవి మీరు ఇరువురు చాకచక్యముతో కష్టతరమైన కాన్పు ను సులభతరం చేసి తల్లి బిడ్డను సంరక్షించారు. కార్యక్రమంలో ఎం పిహెచ్ఇఒ జయరామయ్య, కె.శుభరత్నమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.వెంకటే శ్వరరావు, ఎఫ్ఎన్ఒ అలివేలు మంగబాయి పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగింపు

ప్రజాశక్తి-చిన్నమండెం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని మల్లూరు కస్పాకు, చాకిబండ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా నదిలో ఉన్న పెద్దబండరాళ్లు, కంపచెట్లను బుధ వారం సర్పంచ్ నజీర్ జెసిబి సాయంతో తొలగింపజేశారు. గత మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా ఎగువ ప్రాంతం నుంచి నీరు ఎక్కువగా వస్తుందని, ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా స్థానిక ఎంఎ డిఒ దివ్య, మల్లూరు సర్పంచ్ దేవపట్ల నజీర్‌ల ఆధ్వర్యంలో జెసిబి సాయంతో బండ రాళ్లను, కంపచెట్లను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ హర్షవర్ధన్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ గౌస్ పీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజ్ కుమార్, శివకుమార్ నాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ రామ్మోహన్, మల్లూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నీటి కొరత లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి- కలకడ

అల్పపీడన ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఇరగన్న పేర్కొన్నారు. తాగునీరు, పశువులకు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున నీటిని భద్రపం చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ అబ్దుల్‌షరీఫ్ మాట్లా డుతూ మండలంలో పడుతున్న విపరీ తమైన వర్షాల వల్ల నష్టాలు వాటిలతో సంబంధిత అధికారుల సచివాలయాలనుండి సమాచారం సకాలంలో అందించాలని తెలిపారు. పాబడుబడిన బంగ్లాలు, మొండి గోడలు వద్ద ఉండరాదని వాటి వల్ల ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నీటిని వేడి చేసుకుని తాగాలని సూచిం చారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫణికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

-ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అన్నమయ్య జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైసిపి అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నదులు, వాగులు వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పాడుబడిన ఇండ్ల వద్ద, విధ్యుత్ స్తంబాల వద్ద ఉండరాడని, అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు రావద్దని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే అధికారులకు, ఆయా ప్రాంతాల లోని కంట్రోల్ రూమ్‌లకు తెలపాలనిచెప్పారు. ఆయా ప్రాంతాలలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఏదైనా ఇబ్బంది వచ్చినా అందుబాటులో ఉంటారని తెలిపారు.

22న ఐటిఐలో మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక తంబళ్లపల్లి ప్రభుత్వ ఐటిలో ఈనెల 22న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఎపి స్కిల్ డెవలప్మెంట్, జిల్లా ఉపాధి, డిఆర్‌డిఎ సీడ్ ఆఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. పదవ తరగతి నుంచి పీజీ వరకు చదివిన 18 నుంచి 30 ఏళ్ల వయసు వారు అర్హులని అన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఉపాధి అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. మరిన్నీ వివరాలకు 8897776368 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సహాయక చర్యల్లో ముందుంటాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో అన్నమయ్య జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా సహాయక చర్యలు చేపట్టేందుకు, ఆహారం కోసం ఎవరైనా ఇబ్బంది పడినా సేవలందించేందుకు హెల్పింగ్ మైండ్స్ బృందం సిద్ధంగా ఉందని వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలకు తమ వంతు సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సంస్థ సభ్యులు ఫయాజ్, కిరణ్, ఖాజా పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం గ్లోరీ పాస్టర్ అసోసియేషన్ మదనపల్లి అధ్యక్షులు బోనాసి జాన్‌బాబు ఆధ్వర్యంలో చర్చి పాస్టర్లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. వరద బాధితుల సహాయం కోసం సిఎం సహాయ నిధికి రూ.10,116 డిడిని అందించారు. వరద బాధితులకు తమ వంతు చిరు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో జరిగే క్రైస్తవ పాస్టర్ల అసోసియేషన్ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యేను అహ్వా నించారు. క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.క్రైస్తవులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ జీవరత్నం, సెక్రటరీ పాస్టర్ సంసోన్, పాస్టర్ డానియేల్ నాయక్, ట్రెజరర్ సమూయేలు, నిమ్మనపల్లి సుధాకర్, అహరోను పాస్టర్ దేవమణి సామ్యూల్, కమిటీ సభ్యులు, 29వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి శ్రీరాములు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చిరు సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని బొమ్మవరం గ్రామంలోని పేద కుటుంబానికి బొమ్మ వరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయ కులు ఉమ్మల రాజు పిచ్చి రాజు కుమారుడు ఉమ్మల రాజు సుబ్బరాజు బియ్యం, నిత్యావసరాలు అందించారు. ఈ చిరు కుటుంబానికి ఏదో ఒక రూపంలో సహాయం చేయడానికి ముందు ఉంటానని తెలిపారు. వర్షాల నేపథ్యంలో పూట గడవడానికి కూడా కష్టంగా ఉన్న కుటుంబాలకు ఏదో కొంత సహాయం చేయగలిగితే వారు కూడా మూడు పూటలా తినగలుగుతారని అన్నారు. ఆ ఉద్దేశంతోనే ఆ కుటుంబానికి బియ్యం, సరుకులు వితరణగా అందించానని చెప్పారు. ఇలాంటి పేదవారిని గుర్తించి మంచి మనసున్న వ్యక్తులు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో కూలి పనులకు వెళ్లడానికి కూడా ఇబ్బంది పడి పూట గడవడానికి ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఏదో కొంత సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం : సిఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు సూచించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంకా రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాల్మీకిపురం సర్కిల్ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకి పురం మండలాల ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత భవనాల్లో నివసించే వారు, కొండ చరియలు విరిగిపడే ప్రాంతాల్లో నివసించే వారు సురక్షిత ప్రాంతా లకు వెళ్లాలన్నారు. పిల్లలను వర్షాల్లో పంపకూడదని, ముఖ్యంగా చెరువులు, వాగులు, వంకలు, వరద నీరు ప్రవహించే ప్రదేశాలకు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. విద్యుత్ స్విచ్‌లను తడిచేతులతో ముట్టుకోకూడదని, విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫోన్ మాట్లాడడం వంటివి చేయకూడ దన్నారు. విరిగి చెట్లపై ఉన్న విద్యుత్ తీగలను తాకకుండా సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. అత్యవసర సమయంలో వాల్మీకిపురం సిఐ ప్రసాద్ బాబు 9440796714, వాల్మీకిపురం, ఎస్ఐ చంద్రశేఖర్ 9440900712, గుర్రంకొండ ఎస్ఐ మధురామచంద్రుడు 9440900714లను సంప్రదించాలని ఆయన సూచించారు.

విరామం లఘుచిత్రం ముహూర్తపు కార్యక్రమంలో దర్శక, నిర్మాత, నటీనటులు

పీలేరులో 'విరామం' లఘుచిత్ర నిర్మాణం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో 'విరామం' లఘుచిత్రం నిర్మాణం ప్రారంభమైంది. శిబ్బాల అరుణ సమర్పణలో విజయ్ క్రియేషన్స్ పీఎల్ఆర్ బ్యానరుపై విరామం లఘు చిత్రం ముహూర్తం బుధవారం పీలేరు మండలం, ఎర్రగుంటపల్లిలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో చేశారు. ట్రయాంగిల్ లవ్ స్టోరీ బ్యాక్ డ్రాప్ లో స్నేహం, ప్రేమ, నమ్మకం కథాంశంలో చిత్ర నిర్మాణం చేపట్టినట్లు దర్శకులు ఎస్.కె. సురేష్, నిర్మాత ఎస్.విజయ్ కుమార్ తెలిపారు. యూత్ ఫుల్ లవ్ స్టోరీతో నిర్మిస్తున్న ఈ చిత్రం ముఖ్య తారాగణంలో కథానాయకుడిగా అభి, కథానాయికిగా సనా, ఇతర ముఖ్య పాత్రల్లో ఎన్టీఆర్ లెజెండరీ అవార్డు గ్రహీత ఖాదర్‌బాషా షేక్, షైన్ బాబ్జాన్, తరిగొండ రాధాకృష్ణ, సురేష్, ఎస్. విజయ్ కుమార్, కృష్ణ, సుహేల్, మధు, చంద్ర, అను, బేబీ ఆరాధ్య, మన్సూర్ నటిస్తున్న ఈ చిత్రానికి డిఒపిలుగా మన్సూర్, సుహెల్ వ్యవహరిస్తున్నారు. ఈ లఘుచిత్రం నిర్మాణం పీలేరు, ఎర్రగుంటపల్లి, బండక్రిందపల్లిలో జరిగే రెండు షెడ్యూల్స్ లో పూర్తి చేయనున్నట్లు దర్శకనిర్మాతలు తెలిపారు.

హ్యాండ్ లూమ్స్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీరభాస్కర్

నష్టపోయిన చేనేతలను ఆదుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారీ వర్షాలతో నష్టపోయిన చేనేతలను ఆదుకోవాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఒర్సు వీరభాస్కర్ కోరారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తుఫాను చెలరేగడంతో గత పది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చేనేత కార్మికులకు ఉపాధి లేక తీవ్రంగా నష్టపోయారని, వారికి నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందజేయాలన్నారు. బుధవారం మంగళగిరిలోని హ్యాండ్ లూమ్స్ కమిషనర్ రేఖరాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున వారికి 50 కేజీల బియ్యం, కిలో కేజీ చక్కెర, కిలో కంది పప్పు, 2 లీటర్ల పామయిల్, కేజీ చింతపండు రూ.20 వేలు ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్షపు నీరు కారణంగా చేతి మగ్గాలకు పనిలేక ఎమి చేయాలో దిక్కుతోచక చేనేతల కుటుంబాలు, వారి పిల్లలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అయోమయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నేతన్నల సమస్యలను దృష్టిలో పెట్టుకుని అండగా నిలవాలని కోరారు.

హౌసింగ్ ఇన్‌ఛార్జిగా నాగముని నాయక్

ప్రజాశక్తి- కలకడ

కలకడ మండల హౌసింగ్ ఇన్‌ఛార్జి ఎఇగా నాగమునినాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఇక్కడే హౌసింగ్ వర్క్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహించినట్ల తెలిపారు. పదోన్నతిపై హౌసింగ్ ఇన్‌ఛార్జి ఎఇగా బాధ్యతలు చేపట్టినట్లు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.అదే విధంగా గత ప్రభుత్వంలో మంజూరైన సకాలంలో పూర్తి చేస్తే వాటి బిల్లులు చెల్లించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గృహ లబ్దిదారులు ఇంటి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

క్రైం కార్నర్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-రామాపురం

కడప-రాయచోటి రోడ్డులో మేదరపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఇన్నోవా వాహనంలోనాలుగు ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తుండగా వాహనతో సహా నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు లక్కిడిపల్లి సిఐ పర్యవేక్షణలో ముందస్తు సమాచారం మేరకు బుధవారం మేదరవల్లి చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. కడప వైపు నుంచి టయోటా ఇన్నోవా కారులో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న నింది తుడు షేక్ జిలానిబాషాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కారుతో సహా నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని తెలిపారు.

కారు ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : కారు ఢీకొన్న ఘటనలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం పట్టణ శివార్లలో చోటు చేసుకుంది. సిఐ చాంద్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కోళ్లబైలు గ్రామం, జగన్ కాలనీకి చెందిన వెంకటరమణ, మేనక దంపతులు ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యం లోని అమ్మచెరువు మిట్ట గంగమ్మ గుడి వద్ద కారు ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. గమనించిన స్థాని కులు బాధితులను ఆటోలో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మేనక పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు సిఐ తెలిపారు.

యువకుడిపై దాడి : కేసు నమోదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మల్లికార్జున సర్కిల్లో మంగళవారం రాత్రి యువకుడిపై పలువురు దాడికి పాల్పడ్డ ఘటనపై పోలీసులు స్పందించారు. మూకుమ్మడిగా దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి వన్ టౌన్ ఎస్ఐ అన్సర్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం, చీకిలబైలు గ్రామం, బార్లపల్లెకు చెందిన జగదీష్, రెడ్డి భాషలు స్నేహితులని తెలిపారు. వీరి దగ్గర నాలుగు నెలల క్రితం చంద్ర కాలనీకి చెందిన దేవా, సురేష్‌లు బుల్లెట్ బైక్‌ను కుదవ పెట్టారని అన్నారు. ఆ వాహనాన్ని విడిపించుకోమని జగదీష్, రెడ్డి భాషాలు ఒత్తిడి తెస్తూ వచ్చారని చెప్పారు. ఈ వ్యవహారం చివరకు తాలూకా పోలీసుస్టేషన్ వరకు వెళ్లిందన్నారు. సమస్యకు పరిష్కారం లభించక పోవడంతో స్థానిక మల్లికార్జున సర్కిల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ మాట మాట పెరిగి జగదీష్, రెడ్డి బాషాలపై చంద్ర కాలనీకి చెందిన దేవా, సురేష్, భాస్కర్, వెంకీ మరి కొంతమంది కలిసి మూకుమ్మడిగా దాడి చేసి చితకబాదారని చెప్పారు. పోలీసులు రావడంతో దాడికి పాల్పడిన నిందితులు పరారయ్యారని అన్నారు. వన్ టౌన్ సిఐ చాంద్ భాషా, ఎస్ఐ అన్సర్‌బాషా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.